

# జనవాక్యం

మరువాడ రాజేశ్వరరావు

అప్పారావు మనసంతా చికాగ్గా ఉంది.

అతనికి అన్యాయం జరిగింది. అన్యాయం జరిగిందని తెలిసీ, ఏం చెయ్యాలో తెలియని క్షణాలు...ఆ క్షణాలు గడవకుండా నిలిచిపోయేయి

అతని చూపులు మాటిమాటికి ఎదురుగా ఉన్న కిరాణా దుకాణం మీదికి... ఆ చూపుల్లో ఆశ, నిరాశ; జాలిగా అభ్యర్థన, కసి, కోపం!

కిరాణా దుకాణంయజమాని—షావుకారు సాంబయ్య—ఆ రోజు అతన్నీ అతని రిక్షానీ వేరు చేసేడు.

ఆ రిక్షా అతనిప్రాణం! ఏడాదిపైగా ఆ బండితో అతని అనుబంధం. అతనికి చిన్నప్పుడు అన్నంపెట్టే అమ్మమీద ఎంతో ప్రేమ, అభిమానం... యిప్పుడు తనకి అన్నం పెడుతున్నది ఆ రిక్షాయే నని అతని నమ్మకం.

ఆ రిక్షా అతను కొనుక్కున్నదికాదు. సాంబయ్యదగ్గర అద్దెకి పుచ్చుకున్నది. కిరాణా దుకాణం వెనక సాంబయ్య మేడ. మేడ వెనకజాగాలో రిక్షాలు అద్దెకిచ్చే వ్యాపారం.

ఆ రోజునించి అప్పారావుకి రిక్షా యివ్వనన్నాడు సాంబయ్య. మూడురోజులుగా అప్పారావు రిక్షా తీసుకోడానికి రాలేదు. చెప్పా పెయ్యకుండా మానేస్తే సాంబయ్య ఏమనుకోవాలి? ఆ రిక్షా యింకోడికిచ్చీసేడు.

అసలు కారణం అదికాదు నెల్లాళ్ళ కిందటిమాట...

అప్పారావు ఆ రోజు యింటినుంచి బయల్దేరడం ఆలస్యమైంది. ఆత్రంగా పరిగెట్టుకుంటూ వచ్చేడు. అల్లంత దూరంనుంచే, అన్ని రిక్షాలూ వెళ్ళిపోయినట్టు అర్థమైపోయింది. ఒక్క రిక్షా మిగిలిఉంది. అది తనదికాదు. తన రిక్షా మరెవరో పట్టుకుపోయేరు...అతని రక్తం కుతకుతా ఉడికిపోయింది.

"యిదేటి బాబూ? నా బండీ కాన్రాదేటి? నా బండీ ఏటైపోనాది బాబూ?"


"అది నీ బండీ కాదేటి? పోనీ, ఇయ్యాల్టికీ బండియే తీసికెళ్ల మరాలీ సెంగెందుకొచ్చేవ్!"

అప్పారావు బాధ సాంబయ్యకి అర్థం కాదు.

"అదేటి బాబూ? నా బండీని ఎవడో ఎత్తుకుపోడ(వా?నానింకోడి బండీ తొక్కడ(వా? యిదే(వి నాయం బాబూ! ఏ దొంగ తొత్తుకొడుకో నా బండీ ఎత్తుకెలిపోతూంటే ..సూస్తూ ఊరుకున్నావేటి బాబూ?.. ఆ లీసెంగొస్తే యింకోక బండీ నెత్తుకెళిపోడ(వేనేటి? నీసొమ్మేం పోవాల! నీ అద్దిడబ్బులీన్నీ కొస్తే కాన. నా బండి బాబూ, అది నా బండి!... రోడ్డుమీద కనబడకపోతాదా....అడి పని సెప్తా నియ్యాల!"

'నా' బండి; 'నా' బండీ అంటూ దాని మీద అప్పారావు అంత అభిమానం పెంచుకోవడం సాంబయ్యకి అంతగా నచ్చలేదు. అది అప్పారావు సొంతబండి అయినట్టు మాట్లాడ్డం చూస్తే కొంత భయం వేసింది. షావుకారు అప్పటికేవీ అనలేదు. ఆ రోజునించీ అప్పారావునీ, అతని బండినీ చూసినప్పుడల్లా ఏదో గుబులుగా ఉండడం ప్రారంభించింది. ఎలాగో అతన్ని వొదిలించుకోవాలి...., ఏదో చిన్న కారణం. అది దొరికిందీ రోజు—అప్పారావు మూడ్రోజులుగా బండి తీసుకోడానికి రాలేదు!

చెల్లికి ప్రాణం మీది కొచ్చిందని కబురు తెలిసి, వెంటనే అర్జెంటుగా వాళ్ళ ఊరికి వెళ్ళవలిసొచ్చిందని; ఆ మూడ్రోజులూ బండి తీసుకెళ్ళక పోయినా, అద్దె అర్రూపాయలూ, రోజుకి రూపాయి చొప్పున ఆర్రోజుల్లో చెల్లించేస్తాననీ, ఈసారికి మన్నించమనీ




సాంబయ్య కాళ్ళావేళ్ళాపడి వేడుకున్నాడు అప్పారావు,

సాంబయ్య మనసు కరగలేదు.

చేసేది లేక, రిక్షాని బలవంతంగా లాక్కుపోవటానికి అప్పారావు చేసిన ప్రయత్నం...మనస్ఫూర్తిగా జరగలేదు.

సాంబయ్య ఉగ్రుడయేడు.

"ఏఁవిరా! ఈ బండి నువ్వు కొన్నావా. నీ బాబు కొన్నాడ్రా? నా బండీ అది. నా యిష్టం వొచ్చినోడి కిచ్చుకుంటాను. దవుర్జన్యం సేస్తావేటి? నా సంగతి నీకు తెల్దు కబోసు! యిన్స్పెక్టరు కామేశ్వర్రావుకి ఫోన్సేసేనంటే నిమిషంలో పంపిస్తాడు, పేను. ఎలిపోయి కూకుందువుగాని, తిన్నగా మరి శ్రీకృష్ణ జన్మ స్తానానికే. తెగులు కుదిరిపోద్ది. ముండా దౌర్జన్యవూ నువ్వూను!"

ఏడాదిపాటు తన ప్రాణంతో సమానంగా చూసుకుని, తన రెక్కలు కరిగేలాగ తొక్కిన బండి, తన బాబు కాని, తను కాని 'కొనలేదు' కనక, అది తన బండి కాదని బోధపడినప్పుడు అప్పారావు తలనిండా ఉక్కపోస్తున్నట్లైంది.

'నీ తల, నీ కాళ్లు, నీ చేతులు నేను కొనుక్కున్నా'నని చెప్పి ఎవరేనా కోసుకుపోతామంటే ఎలాగనిపిస్తుందో అలాగనిపించింది.

వీలు దొరికినప్పుడల్లా రిక్షాలో ఏ భాగం ఏ కండిషన్‌లో ఉందో చూసుకుని, కావలసిన రిపేర్లు తనే స్వయంగా

చేసుకునేవాడు. సక్రమంగా ఆయిలింగ్ చేస్తూ బండిని ఎప్పుడూ చక్కటి కండిషన్‌లో ఉంచేవాడు. అఫీషియల్ కాలనీ రెండోదౌన్‌లో బ్రేకులుపట్టక ఎన్నో రిక్షాలు పచ్చడైపోయేయి; ఎందరో రిక్షావాళ్ళ తలలు బద్దలైపోయేయి కాని, అప్పారావు రిక్షా బ్రేకులు పట్టకపోవడం అనేది ఎప్పుడూ జరగలేదు. రిపేర్లకీ, ఆయిలింగుకీ అయే ఖర్చు తనే పెట్టుకునేవాడు. ఆ బండిని రెండో షిఫ్టులో తొక్కే వెంకన్నకి 'జాగ్రత్త' చెప్పి హెచ్చరించనిరోజు లేదు.

ఆ బండి లేనిదే అతని కాళ్లూ, చేతులూ, మనస్సూ పనిచెయ్యవు. అతని అవయవాలు పనిచెయ్యందే బండికూడా పనిచెయ్యదు. బండిని తన శరీరంలో భాగంగా, తన జీవితంలో చైతన్యంగా, తను పీల్చే ఊపిరిగా, తన వొంట్లో రక్తంగా, తన స్వంత తమ్ముడిలాగ చూసుకున్నాడు అప్పారావు. పని చేసుకునేవాడినించి పనిముట్టుని వేరుచేసి కొల్లగొట్టే పద్ధతి... అతని బుద్ధికి తోచిన న్యాయస్థానాలన్నీ దాన్ని బలపరిచేవే.

గుండెల్లోంచి గొంతుదాకా మంట... కళ్ళల్లో సెగలు...ఏం చెయ్యాలో తెలీక షావుకారు సాంబయ్య కిరాణా దుకాణానికెదురుగా, రోడ్డుకి అవతలివక్క ఎలక్ట్రిక్‌స్తంభాన్నానుకుని నించున్నాడు.

* * *

ఎండ ముగ్గుబెండగా మారింది. గాలి స్తంభించిపోయింది. పదకొండు గంటల వేళ...

దుకాణాల్లోనూ, రోడ్డుమీదా అట్టే రద్దీలేదు. షావుకార్లు చిన్న పిసరు కునికిపాట్లుపడుతున్నారు..,కునికిపాట్లు పోవడానికి టీతెప్పించుకుంటున్నారుకొందరు.

స్తబ్ధుగా ఉన్న వాతావరణాన్ని చీల్చుకుంటూ ఓ కేక... "పట్కో పట్కో !"

ఉలిక్కిపడ్డాడు అప్పారావు.

నడిరోడ్డుమీద...

స్టీలు గిన్నెల దుకాణంలో పనిచేసే గడ్డం సాయిబు రెండు చేతుల్లోనూ ముగ్గురు పసివాళ్ళు చిక్కుకుని గింజుకుంటున్నారు. పదిహేనేళ్ళ వాడొకడు, దాదాపు పదేళ్ళవాళ్లు యిద్దరూ.

రోడ్డుమీద పోయే జనం ఆగి, అటు ఒకసారి వింతగా చూసి, కొందరు ముందుకి సాగిపోతే, మరికొందరు సాయిబునీ, అతని చేతిలో కుర్రాళ్ళనీ అనుసరించేరు.

అలా అనుసరించినవాళ్ళలో కేరేజీలు మోసే ఆడపిల్లలిద్దరూ, కాలేజీకి వెళ్తున్న స్టూడెంట్లిద్దరు, కాలేజీనుంచి వస్తున్నవాళ్ళు ముగ్గురు, మాసిన గడ్డం పీరసమైన కళ్ళు ఉన్న ఒక నిరుద్యోగీ, చేవలతట్ట నెత్తికెత్తుకున్న ముసిల్ది, కూరలు కొనుక్కువెళ్తున్న మధ్య వయస్కులు ముగ్గురూ, సెలవులకి బంధువులింటికి పైఊర్నించొచ్చి ఊరు

చూడ్డానికి రోడ్డుమీదపడ్డ యువకులిద్దరూ, కాలేజీ ప్యూనూ, యిద్దరు హైస్కూలు కుర్రాళ్ళు ..మొత్తం దాదాపు పాతిక మంది సాంబయ్య కిరాణా దుకాణం ముందు చేరేరు. సాంబయ్యతో ఏదో చెప్తున్నాడు సాయిబు. అప్పారావుకూడా అక్కడికెళ్లేడు.

"ఏటో దొంగలాడేరంట !"

కేరేజీలు మోసేపిల్ల, చేపల తట్ట నెత్తికెత్తుకున్న ముసిల్దానితో చెప్తోంది. ఓ పదిజతల కళ్ళు ఆ పిల్లవేపు చూసేయి.

"ఏటి దొంగలాడేరు ? అళ్ళసేతుల్లో ఏటీనేదే ?"....చేపల ముసిల్ది.

మళ్లీ సాయిబు వేపూ, అతని చేతిలో కుర్రాళ్ళవేపూ చూసేరు జనం.

"మొన్న, మంగళారంనాడు రోడ్డు మీదెళిపోతూ ముసిలాయనొకరు చూసేరండీ ఈళ్ళు పట్టిదెత్తుకు పోవడం. ఆయనొచ్చి, నాతో చెప్పేరన్నమాట— ఎవులో కుర్రోళ్ళు మీ పట్టిదొకటి పట్టుకుని అలా సందులోకి పారిపోయేరండీ. అని। నాకీ యెదవల మీదే అనుమానం. సాయిబు గార్తో చెప్పేను. ఓ కన్నేసుంచండీ అని. ఇయాళ మళ్ళీ పట్టిదెత్తుకుపోడాని కొచ్చీశేరు..." అని స్టీలు కొట్టు సుబ్రహ్మణ్యానికిచెప్తూ, ఆకుర్రాళ్ల వేపు తిరిగి,

"ఏంవిరా, నీ బాబు కొన్నాడనుకున్నావురా పట్టెళ్ళు ..ఆ పట్టెడకి డబ్బె వరిస్తార్రా ?....ఏటి ?" కొస్త వెక్కిరింపుగాను, కోపంగాను అన్నాడు.

జనం, వాళ్ళల్లో వాళ్ళు మాట్లాడుకుంటున్నారు ... ఎవరికో పట్టెడంటే బోధపడలేదు "పట్టెడా ?"

"అవును పట్టెడే"

"పట్టెడంటే ?"

"నవారు ... మంచం నేసుకునే నవారు."

"ఏంటీ ? ఏంవైందీ ?" అంటూ లోపలికి తొంగిచూసిన శాస్త్రిగారి వొంటి మీద ముసిలమ్మ తట్టలోంచి చేప పడింది.

కొందరు నవ్వేరు.

బ్రాహ్మడికి కోపం వచ్చింది. "నీ శ్రాద్ధం పెట్టా। మనుషుల్ని చూసుకోవుటే ?" అంటూ అరిచేడు.

అతని గొంతువిని అందరూ అటే చూసేరు.

"ఎక్కడో తద్దినం భోజనానికి వెళ్తున్నట్టున్నారు. ఆ చేప పట్టుకుపోండి." ఓ పాతికేళ్ళ యువకుడు కొంటెగా నవ్వుతూ అన్నాడు.

"అదెక్కడ దాచేరో ఇచ్చిండర్రా, బాబుగారొదిలేస్తారు" కాలేజీ ప్యూను రంగయ్య హెచ్చరించేడు, కుర్రాళ్ళని.

"ఎన్నాళ్నించీ చేస్తున్నారో యేంటో, వాళ్ళొదలకండి"— షైర్లు అమ్మే పాపారావు, అతని భార్య పక్కింటి బేంకు గుమస్తాతో ఎన్నాళ్లో సాగిస్తే, పిల్లల్ని కన్న నాలుగేళ్ళకి పోలీసులు బైటపడి,

అతనికి నిజం తెలిసింది. అప్పట్నించీ ఏ కానిపని జరిగినట్టు తెలిసినా, ఎన్నాళ్ళనించీ జరుగుతుందో అని తెగ అనుమానపడిపోతూ ఉంటాడు.

"ఒదల్దంవా, ముందా పోలుకేసి కట్టండి. ఈళ్ళని చాలా రోజుల్నించీ చూస్తున్నాను. ఈళ్ళకొకసారి బుద్ధిచెప్తే గానీ, తెలవదు" — చాలా కోపంగానే అన్నాడు బట్టలకొట్టు పైసారామ్.

"కట్టండీ...కట్టేండి!" పది గొంతుకలు ఉత్సాహంగా ఆమోదించేయి.

ఎవరో తాడు తెచ్చేరు. చేతులు విరిచి, ముగ్గుర్ని ఒకే పోలుకి కట్టేసేరు.

"చెప్పు...వట్టెడేంచేసేవో చెప్పు... చెప్పంట్రా?"

"యింకా ఏఏటి దొంగలాడేరో ఎక్కడమ్మేసేరో అన్నీ సెప్పండి. లేకపోతే ఇయాళ మిమ్మల్ని సంపేడంవే!"

ఒక్కటి తగల్నిస్తేగానీ, నిజం చెప్పరు..., కొట్టు, కొట్టండి!"

ఆ బజార్లోఉన్న దుకాణదార్లంతా అక్కడ చేరేరు.

దొంగతనంచేసిన కుర్రాళ్ళమీద అప్పారావుకి అట్టే జాలి కలగలేదు కాని, వ్యాపారస్తులైన ఆ పెద్దలందరి చూపుల్లోనికోపం, వాళ్ళగొంతుల్లోని క్రౌర్యం, కసి, చూస్తే ఆశ్చర్యం వేసింది.

వాళ్ళ ఆస్తులకీ, సంపదలకీ చిన్న ప్రమాదం సూచనప్రాయంగా కనిపించినా వాళ్ళు సహించలేరు. గోడలమీద గాంధీబొమ్మలు తగిలించుకున్న అహింసామూర్తులంతా ఆవేశంతో మత్తెక్కి రక్తంకోసం తహతహ లాడిపోతారు.

ఆ కుర్రాళ్ళకి వొంటిమీద చొక్కాల్లేవు. బాగా మాసిన లాగులు తొడుక్కున్నారు. యిద్దరివి నల్లని శరీరాలు, ఒకడు కొంచెం తెల్లగా ఉన్నాడు. ముగ్గురి వొంటిమీదా మట్టి, ముట్టుకుంటే అంటుకుంటుంది. మొహాంమీద మరకలు. కళ్ళవెంట నీళ్ళుకారుతున్నాయి. చొంగలు కార్చుకుంటూ, ఏడుస్తున్నారు. వాళ్ళకళ్ళలో క్రూరమృగాల చేతికి చిక్కినంత భయం. వాళ్ళ డొక్కలు లోపలికి ముడుచుకునున్నాయి.

ముందు ముందు సాంబయ్యలాంటి వాళ్ళే నాలుగు గడ్డిపరకలు రాల్చి. వాళ్ళని తమ చీకటి వ్యాపారాలకీ, తమ అంగరక్షణకీ, తమ చేతుల్తో చెయ్యలేని నేరాలు చేయించడానికీ వాడుకుంటారని అప్పారావుకి తెలుసు. ఆకలిబాధ ఓర్చుకోలేక ఒకసారి నేరంచేసిన వాళ్ళు, సాంబయ్యలాంటి వాళ్ళ పన్నేఉచ్చులో సులభంగా తగులుకుపోతారని అనుభవంతో గ్రహించేడు అప్పారావు.

టైము గడుస్తున్నకొద్దీ అప్పారావు మానసికస్థితిలో మార్పు వస్తోంది. సాంబయ్యలాంటి వాళ్ళని బతిమాలడం నిరర్థకం, నిష్ప్రయోజనం అని అర్థమైపోయింది. తన రిక్షా విషయంలో తనకి

న్యాయం జరుగుతుందనే ఆశ పూర్తిగా అడుగంటిపోయింది. తిరుగుబాటు భావం అతనిలో తలెత్తింది. దాన్నెలాగ ప్రకటించాలో, ఆ భావం ఎటువంటి కార్య రూపం తీసుకోవాలో స్పష్టం కాలేదు.

జనం గుంపులోంచి కొందరు వెళ్ళిపోతుంటే, కొత్తవాళ్ళుచేరి, 'ఏఁవైంద'ని అడుగుతున్నారు. రోడ్డుమీద వచ్చేపోయే కార్లూ, బస్సులూ జనాన్ని తప్పుకుపోవడానికి కొంచెం కష్టపడవలసివస్తోంది.

ఎవరి చేతికందినట్టు వాళ్ళు ఒకమొట్టికాయో, లెంపకాయో, జెల్లకాయో, — ఎవరి శక్తికితగ్గట్టు వాళ్ళిచ్చుకుంటున్నారు. అడ్డుకోవడానికి ఆ కుర్రాళ్ళ చేతులు పనికిరాకుండా, తాళ్ళతో కట్టేసేరు.

అక్కడ చేరిన వాళ్ళలో కొందరికి యిదంతా అమానుషంగా కనిపించింది. ఒక యువకుడు కోపంగా కసురుకున్నాడు. "వాళ్ళని కొట్టకండి. కావలిస్తే పోలీసుల కప్పగించండి!"

"ఈ పక్కనే, పదడుగులదూరంలో ఉంది పోలీస్‌స్టేషను. యింత జరుగుతున్నా ఒకడూ కనపడ్డేం?" అందుకున్నాడు మరో యువకుడు.

"పోలీసుల కప్పగించండి" అన్నాయి పదిహేను గొంతుకలు.

"పోలీసుల కప్పగిస్తే ఏటొద్దండీ. ఆళ్ళూ నాలుగు జెల్లల్లాగేసి మళ్లీ రేపే వొదిలేస్తారు. వొదిలేస్తే మళ్లీ రేపట్నుంచీ మామూలే. మరి మనం బతకాలా? పోలీసులూ కోర్టులూ అంటే ఆ గొడవలన్నీ మనం పడగలఁవా! అయినా ఆళ్ల వట్టించుకోరండీ ..."

జనాన్ని ఒప్పించడానికి అప్పారావు ప్రయత్నం.

"పోలీసులూ,కోర్టూఅంటే,అక్కడా మరి మనుషులేనా? మనకన్న తెలివైనోళ్ల కూర్చున్నారేటక్కడ? ఆళ్ళకి ఆరు బుర్రలూ, ఎనిఁవిది సేతులూ లేవు. ఆళ్ళు చెప్పక పోతే దొంగవని దొంగవని కాకుండా పోద్దేటి? ఆళ్ళేసే సిక్షే మనఁవూ యేస్తన్నాం. జనఁవంతా ఉన్నారుగద! యిదే ఒక్కోర్టు!"

నవ్వుతూ, చేతులూపుతూ, కనుబొమలు ఎగరేస్తూ, చమత్కారంగా మాట్లాడేడు సాంబయ్య.

ఆ మాటలు విన్న అప్పారావు ఆలోచనల్లో ఏవో మెరుపులు మెరిసేయి.

"ఈళ్ళని సంపేస్తే పావఁవుందా" అని అడుగుతున్నాడు పైసారాం.

ఊపిరి విడిస్తే సూక్ష్మక్రిములు చచ్చిపోయి, జీవహింస జరిగిపోతుందని భయపడే జైనమతస్థుడతను.

పోలీసులగురించీ, కోర్టులగురించీ, శిక్షలగురించీ, జనంగురించీ అంతకుముందు సాంబయ్య అన్నమాటలు అప్పారావుమీద తీవ్రంగా పనిచేసేయి. తెగింపు, ధైర్యం వచ్చేయి.

జనాన్ని తోసుకుని విసురుగా ముందు కెళ్లేడు.

వ్యాపారులు ఉలిక్కిపడ్డారు. జనం రక్తనాళాల్లో 'రక్తప్రవాహపు' తీవ్రత హెచ్చింది.

సాంబయ్యవేపు కత్తుల్లాంటి చూపులు గురిపెడుతూ కుర్రాళ్ళకట్టిన తాళ్ళు విప్పబోయేడు.

ఎందుకేనా మంచిదని ఫోను దగ్గరికి పరిగెట్టి పోలీస్టేషను నంబరు తిప్పేడు సాంబయ్య మేనల్లుడు.

"అప్పారావ్, యిప్పకు! నీ కనవసరం. యిప్పకు" అంటూ అరుస్తున్నాడు సాంబయ్య.

"ఎందుకూ?"

కటువుగా అడిగేడు అప్పారావు. కుర్రాళ్ళని కట్టిన తాళ్లువిప్పుతూనే.

"దొంగవెధవలు. ఆళ్ళకి బుద్ధి రావాలి. అలా ఉణ్నీ!" ...

"ఆళ్నిప్పేసి నిన్ను కడతాను రా" అంటూ కుర్రాళ్ళకట్టిన తాళ్ళు విప్పేసేడు.

"జనంవే కోర్టు, ఆళ్ళే నీకూ సిక్షేస్తారు ... రా" సాంబయ్యవేపు కోపంగా చూస్తూ అన్నాడు అప్పారావు

"కొట్టు ... కొట్ కొట్టో" అన్నారు కొందరు ఉత్సాహంగా ... జనం మాటలు అర్థంకాని గోలగా ఉన్నాయి. సాంబయ్య గుండెలు గుబగుబ లాడేయి.

యింతలో,

ఉన్నట్టుండి జనంలో రణగొణధ్వని ఆగిపోయింది. పోలీసు వేన్‌లోంచి ఇన్‌స్పెక్టరూ, కొందరు జవాన్లూ దిగేరు.

అప్పారావు నిర్లక్ష్యంగా అటుచూసేడు. కుర్రాళ్ళు ముగ్గురూ ఎటుపారిపోయేరో..

సాంబయ్య మొహం సంతోషంతో చేటంతైంది. నోరు కప్పలాగ తెరుచుకుని, హుషారుగా ముందుకినడిచి యిన్స్పెక్టర్ని ఆహ్వానించేడు.

ఎవరూ పారిపోకుండా జనంచుట్టూ కమ్ముకున్నారు పోలీసులు ...'ఎవరూ, ఎవరు దౌర్జన్యం చేస్తున్నదీ' — చిరుకోపంతో జనంవేపుచూస్తూ అన్నాడు. కాంవేశ్వరరావు.

"ఇడుగోనండీ...కుర్రాళ్ళచేత దొంగతనం చేయించి, అదేంవనడిగితే దౌర్జన్యం చేస్తున్నాడండీ. యిదుగో, నన్నిక్కడ కొట్టేడు" అంటూ చెయ్యి చూపించేడు సాంబయ్య.

"కొట్టేడా?" అని ఆశ్చర్యపోయేరు జనం...కొట్టేడని రుజువుచెయ్యగలడు సాంబయ్య!

అప్పారావుని వేన్‌లో కూర్చోపెట్టేరు. పోలీసులగురించీ, కోర్టుగురించీ, జనంగురించీ—సాంబయ్య మాటలు—కలీఅర్థాల్లో. వేరే సందర్భాల్లో బోధపడుతూ అప్పారావుమీద తీవ్రంగా, మరింత తీవ్రంగా పని చేస్తున్నాయి.

వేన్ కదిలిపోయింది. జనం ఎవరి పనులమీద వాళ్లు వెళ్ళిపోయేరు. దుకాణదార్లు ఎవరి దుకాణాల్లోకి వాళ్లు వెళ్ళిపోయేరు. అందరి ఆలోచనల్లోకీ అప్పారావు ప్రవేశించేడు — కొందరిలోకి ఉత్సాహంలాగ, మరి కొందరిలోకి భయంలాగ!